కొందరికే భరోసా!



అర్హులందరికీ అందని పెట్టుబడి సాయం

సాగు పెట్టుబడి సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం అందరికీ వర్తించకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ సాయం కొందరికే పరిమితమైంది. రంగారెడ్డి జిల్లాలో జీహెచ్ఎంసీ పరిధిలోని తొమ్మిది మండలాల రైతులకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదు. అలాగే మేడ్చల్ జిల్లాలోని పదకొండు మండలాల్లో ఒక్క మండలం(మూడు చింతలపల్లి) పరిధి లోని రైతులకు మాత్రమే రైతు భరోసా పైసలు పడ్డాయి. మిగిలా వారంతా పెట్టుబడి సాయం అందక ఆందోళన చెందుతున్నారు. మాకెందుకు డబ్బులు పడలేదని, బ్యాంకు, వ్యవసాయ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు ఎందుకు రాలేదో తెలియక అధికారులు కూడా ఏం సమాధానం చెప్పలేక పోతున్నారు.



- పలువురు రైతులకు సగం డబ్బులే జమ
- రంగారెడ్డి జిల్లాలో 9 మండలాల్లో అసలే అందని వైనం
- మేడ్చల్‌లో 11 మండలాల్లో ఒక్క మండలానికే పరిమితం
- సాయం అందక ఆందోళనలో రైతులు
- వ్యవసాయ, బ్యాంకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- విధిలేక వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- మంత్రి తుమ్మలను కలిసిన బీఆర్ఎస్ నేతలు
- రెండు రోజుల్లో క్లారిటీ ఇస్తానన్న వ్యవసాయ మంత్రి

రంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసేందుకు రైతన్నలు సిద్ధమయ్యారు. విత్తనాలు విత్తేందుకు దుక్కులు దున్నుకున్నారు. సాగు చేసే ప్రతీ ఎకరానికి రూ.6వేల చొప్పున పంట పెట్టుబడి ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇచ్చిన హామీ మేరకు అమలుకు నోచడం లేదు. కేవలం 4 ఎకరాల్లోపు సాగు చేసిన రైతులకు మాత్రమే రూ.6వేలు జమ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీంతో నాలుగు ఎకరాల పైబడి సాగు చేసే రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయలేదు. దీంతో అన్నదాతలు నిరాశ చెందుతున్నారు. కొంతమందికి నాలుగు ఎకరాల్లోపు ఉన్నవారికి కూడా సగం డబ్బులు మాత్రమే జమ కావడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వానాకాలం సీజన్ ప్రారంభంలో ముందస్తుగా వర్షాలు కురవడంతో రైతులు భూములను చదును చేసుకొని పంటల సాగుకు సిద్ధమయ్యారు. పంట పెట్టుబడి

మిగతా 7వ పేజీలో...



అధికారులు పట్టించుకోవడం లేదు

నాకు వేర్వేరు సర్వేనెంబర్లలో 24 గుంటల భూమి ఉంది. కేసీఆర్ ప్రభుత్వంలో రెగ్యులర్‌గా రైతు బంధు డబ్బులు నా ఖాతాల్లో జమ అయ్యేవి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు పంట పెట్టుబడి సాయం రాలే. వ్యవసాయాధికారుల వద్దకు పలు మార్లు వెళ్లినా ఫలితం లేకుండా పోతుంది. అధికారులు రైతులను పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- మద్దెల ఆనంద్, రైతు, చేవెళ్ల

ఒక్క మండలానికే సాయం

- మేడ్చల్‌లో మొత్తం 11 మండలాలు
- ఆందోళనలో ఓఆర్ఆర్ సమీప మండలాల రైతులు

7

మంత్రి తుమ్మలను కలిసిన మంచిరెడ్డి, సబితారెడ్డి

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాల్లో రైతు భరోసా నిలిపివేయడం తగదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డిలు గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిశారు. వానాకాలం పంటల సాగు మొదలైందని, పెట్టుబడి సాయాన్ని నిలిపివేయడంపై రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని మంత్రి దృష్టికి తీసుకు వచ్చారు. కాగా అధికార యంత్రాంగంతో మాట్లాడి రెండు రోజుల్లో స్పష్టతనిస్తామని మంత్రి వారికి వివరించారు. కాగా వీరి వెంట బీఆర్ఎస్ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, సత్తు వెంకటరమణారెడ్డి ఉన్నారు.

ఆలస్యంగా రావొచ్చు



జిల్లాలోని జీహెచ్ఎంసీ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, బాలాపూర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాల్లో రైతు భరోసా రాలేదు. ఆసల్యంగా రావొచ్చు.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- నర్సింహారావు, జిల్లా వ్యవసాయాధికారి



ఇబ్రహీంపట్నం : కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న నాయకులు

కాంగ్రెస్ పార్టీతోనే పేదరిక నిర్మూలన

- రాహుల్ ప్రధాని కావడమే లక్ష్యంగా పనిచేయాలి
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మొయినాబాద్ రూరల్, జూన్19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని దేశ ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో పేదరిక నిర్మూలన సాధ్యమన్నారు. గురువారం రాహుల్ జన్మదిన వేడుకలను మున్సిపల్ పరిధిలోని అమ్డాపూర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ కేక్‌కట్ చేసి, రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లా నర్సింహ్మారెడ్డి, చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్, కీసరి సంజీవరెడ్డి, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సీనియర్ జిల్లా నాయకుడు బొక్క బాలకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, మర్రి రవీందర్‌రెడ్డి, పురాణం వీరభద్రస్వామి, బొలిగిద్ద సత్యనారాయణ, గౌండ్ల నిరంజన్‌గౌడ్, భైకని కుమార్ యాదవ్, గన్నెపాగ నర్సింగ్‌రావు, అల్లం శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపిక

మొయినాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి నాల్గవ తరగతిలో చేరేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మల్లయ్య తెలిపారు. మండల స్థాయిలో నేడు శుక్రవారం మొయినాబాద్‌లోని ఎంఆర్‌సీహెచ్ పాఠశాలలో ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, అనంతరం క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 2016 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2017 ఆగస్టు 30 మధ్యలో జన్మించిన విద్యార్థులు పోటీలకు అర్హులని చెప్పారు. మండల స్థాయిలో ఎంపికైన వారికి మూడంచెల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. ఆసక్తి గలవారు మరిన్ని వివరాలకు 9985231834, 9676339941లో సంప్రదించ వచ్చని పేర్కొన్నారు.

అడ్మిషన్లు ప్రారంభం

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాధిక, సహాయ కేంద్రం కో ఆర్డినేటర్ శంకర్ తెలిపారు. డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో చేరడానికి ఆగస్టు 13 వరకు గడవు ఉందని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్, నేషనల్ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా ఇంటర్ పూర్తి చేసినవారు, తెలంగాణ ఓపెన్ ఇంటర్ పాసైనవారు, పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో 2024 వరకు పాసైన విద్యార్థులు నేరుగా డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో డిగ్రీలో చేరవచ్చని తెలిపారు. అలాగే ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు కోర్సు ఫీజు కూడా ఆగస్టు 13 వరకు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని చెప్పారు. మరిన్ని వివరాల కోసం 7382929772 నంబర్‌లో సంప్రదించాలని వారు తెలిపారు.

పాడి పరిశ్రమను కాపాడుకోవాలి

- విజయ పాల నాణ్యత పెంచాలి
- టీజీ డీడీసీఎఫ్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత



అధికారులను సన్మానిస్తున్న పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు

కడ్తాల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీ పాల నాణ్యత, పాల ఉత్పత్తుల అమ్మకాలను పెంచి పాడి పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర డీడీసీఎఫ్ రాష్ట్ర క్వాలిటీ కంట్రోల్ అధికారి హెచ్.కవిత, జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పి.మోహన్ మురళి అన్నారు. విజయ పాల నాణ్యత విషయంలో పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వారు సూచించారు. కడ్తాల్ పాత శీతలీకరణ కేంద్రాన్ని గురువారం క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత తనిఖీ చేశారు. నిర్ణీత మేర పాలలో వెన్న శాతం లేదని ఒకింత అసంతృప్తి వ్యక్తం చేశారు. పాల నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడొద్దని సూచించారు. అదే విధంగా కడ్తాల్, సాయిరెడ్డిగూడెం, చెల్లంపల్లి పాల సేకరణ కేంద్రాలను డిప్యూటీ డైరెక్టర్ మోహన్ మురళీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కడ్తాల్ పాల శీతలీకరణ కేంద్రం ఆవరణలో నాణ్యమైన పాల సేకరణపై అవగాహన సదస్సు నిర్వహించారు.

పాడి రైతుల శ్రేయస్సు కోసమే..

క్వాలిటీ కంట్రోల్ అధికారి కవిత మాట్లాడుతూ పాడి రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం సంస్థ మరిన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్ణీత మేర వెన్న శాతం రాని ఎడల ట్యాంకర్లను పంపమని, అలా అయితే పాల సేకరణ కష్టం అన్నారు. ఇకపై పాల సేకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తామన్నారు. లాభాపేక్ష లేకుండా పాడి రైతుల శ్రేయస్సు కోసం విజయ డెయిరీ పని చేస్తుందని తెలిపారు. ఉత్పత్తిదారులు కూడా కొనుగోలుదారుల విశ్వాసాన్ని చూరగొనేలా పాల నాణ్యత పెంచేలా చూడాలన్నారు. పచ్చి మేత, దాణ సమతుల్యత పాటించడం ద్వారా పాల నాణ్యత పెరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ బాబాఉబేరి తెలిపారు. పాడి పశువుల పెంపకంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కడ్తాల్ పాలశీతలీకరణ కేంద్రం ముందు నిర్మించిన దుకాణాలను ప్రారంభించి వినియోగంలోకి తేవాలని, కేంద్రానికి నూతన భవనాలు నిర్మించాలని, ఆధునాతన యంత్రాలు ఏర్పాటు చేయాలని పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు ఈ సందర్భంగా అధికారులతో కోరారు. సంస్థ దృష్టికి తీసుకువెళ్తామని వారు హామీ ఇచ్చారు. సదస్సులో పాల సేకరణ కేంద్రాల అధ్యక్షులు వెంకటేశ్, రంగయ్య, నర్సింహారెడ్డి, పంతు నాయక్, లక్ష్మణ్, రంగ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : 2024-25 సంవత్సరానికి జిల్లాలోని దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. రెట్రో ఫిట్టర్ మోటర్ వాహనాలు, బ్యాటరీ వీల్‌చైర్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ సైకిళ్లు, బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో వెహికిల్స్, హైబ్రిడ్ వీల్‌చైర్, అటాట్మెంట్ వీల్‌చైర్, ల్యాప్‌టాప్‌లు, టాప్స్, ఫోర్‌జి స్మార్ట్ ఫోన్లు, ట్రై సైకిళ్లు, ఆర్టిఫిషియల్ లిమ్స్, క్రచ్చస్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ కేన్స్, బ్రెయిలీ బుక్స్, కిడ్స్ టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్, ఎంసీఆర్ చప్పల్స్ ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రెట్రో ఫిట్టర్ మోటర్ వెహికిల్ కోసం దరఖాస్తు చేసిన అన్‌ఎంప్లాయిడ్ అభ్యర్థులు 100 రూపాయల నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌పై సెల్ఫ్ డిక్లరేషన్ జత చేయాలన్నారు. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో ఈనెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా కమిటీ ఎంపిక చేసిన వారికి ఉపకరణాలు అందజేయనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 8019111369, 8897958726 నంబర్లను సంప్రదించాలని ఆమె సూచించారు.

ఫోన్ ట్యాపింగ్ దుర్మార్గులను శిక్షించాలి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఉద్యమకారుల బలిదానాలకు చలించిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తెలంగాణ రాష్ట్రంలో అధికారాన్ని అనుభవించి, ప్రతిపక్ష నాయకులు గెలువొద్దని ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన దుర్మార్గులను ఉరి తీయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాలంటూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ.. ప్రజలను సైతం మోసగించి, అక్రమాలకు, అవినీతికి తెరలేపిందని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఎన్నికల ముందు ప్రతిపక్షాల నాయకుల, అనుచరుల ఫోన్లను ట్యాపింగ్ చేయించి, వ్యక్తిగత స్వేచ్ఛను హరించివేసిందన్నారు. బీఆర్ఎస్ మాదిరిగా కాంగ్రెస్ ప్రభుత్వం బెడ్‌రూమ్ తలుపులు బద్దలు కొట్టి అరెస్టులు చేయదని, చట్టబద్ధంగా ఆధారాలను సేకరించి కఠినంగా శిక్షిస్తుందని అన్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, అర్హులందరికీ కొత్తరేషన్ కార్డులను ఇస్తామని శంకర్ తెలిపారు. షాద్‌నగర్ నియోజక వర్గంలోని 56వేల మందికి రైతు భరోసా కింద రూ.38 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. దేశానికి కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీయేనని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం రాహుల్ జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమాలలో బాబర్‌ఖాన్, అగ్గనూరి విశ్వం, ఏ. కృష్ణారెడ్డి, జి. బాల్‌రాజ్‌గౌడ్, పి. వెంకట్‌రాంరెడ్డి, రఘునాయక్, కొంకళ్ల చెన్నయ్య, జంగ నర్సింహ్మయాదవ్, జమృద్‌ఖాన్, ఇబ్రహీం, అగ్గనూరి బస్వం, కె. పురుషోత్తంరెడ్డి, దంగు శ్రీనివాస్‌యాదవ్, వర్షబటిబరాజు, చంద్రశేఖర్, అందె మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంగీత

యోగా డేను ఘనంగా నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

రంగారెడ్డి అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ఘనంగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో యోగా దినోత్సవ వాల్ పోస్టర్‌ను వైద్యాధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యోగా ప్రాధాన్యతను ఆమె వివరించారు. యోగాతో మానసిక ప్రశాంతత సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో, ప్రోగ్రాం అధికారులు, ఆయుష్ వైద్యులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రీలాంచ్ పేరుతో ఘరానా మోసం

రూ.40లక్షల ప్లాట్ రూ.12 లక్షలకే అంటూ టోకరా!



- ప్రజలను నిండా ముంచిన ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ
- పోలీసులకు ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు

ఆదిభట్ల, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రీలాంచ్ పేరుతో ఓ రియల్ ఎస్టేట్ కంపెనీ ఘరానా మోసానికి పాల్పడింది. రూ.40లక్షల విలువైన ప్లాట్‌ను రూ.12లక్షలకే విక్రయిస్తామని నమ్మించి ప్రజల నుంచి రూ.కోట్లలో డబ్బు వసూలు చేసింది. ఈమేరకు ప్రజలను మోసం చేస్తున్న సదరు రీమాక్స్ రియల్ ఎస్టేట్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్ ఎస్.బాలకృష్ణ ఆదిభట్ల పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. కమిషనర్ గురువారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ వివరాల వెల్లడించారు. ఆదిభట్ల పురపాలక పరిధిలోని కొంగరకలాన్ సర్వేనంబర్ 349/పీ, 350/పీ, 351/పీ, 353/పీ, 354/పీ, 355/పీలో రీమాక్స్ డ్రీమ్ క్యాచ్ అపార్ట్‌మెంట్ పేరిట 2018లో ల్యాండ్ కొనుగోలు చేసినట్లు నకిలీ పత్రాలు సృష్టించారు. కాగా, మున్సిపాలిటీ నుంచి గానీ, హెచ్ఎండీఏ నుంచి గానీ ఎలాంటి అనుమతి కూడా లేదని కమిషనర్ తెలిపారు. అదేవిధంగా ఎలాంటి ల్యాండ్ అలాట్‌మెంట్ కూడా పొందలేదని చెప్పారు. అయితే, ప్రీలాంచ్ పేరుతో రూ.40లక్షల విలువ చేసే ప్లాట్‌లను కేవలం రూ.12లక్షలకే విక్రయాలు జరిపి, ప్రజలను నమ్మించి వందలాది మంది నుంచి అక్రమంగా డబ్బు వసూలు చేశారని పేర్కొన్నారు. రీమాక్స్ కంపెనీ వాళ్లు కొంగరకలాన్‌లో ఎటువంటి ల్యాండ్ కొనుగోలు చేయలేదన్నారు. ప్రీలాంచ్ పేరుతో ప్రజలను మోసం చేసిన సదరు కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కాగా, ఆ రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రాజెక్టుకు సంబంధించిన బ్రోచర్‌పై బ్రజేష్ అనే పేరు, సెల్ నెంబర్ : 7702477272గా ఉందని కమిషనర్ పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రీలాంచ్ పేరుతో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా పుష్పావతి



నియామక పత్రం అందుకుంటున్న పుష్పావతి

మొయినాబాద్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలిగా మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని హిమాయత్ నగర్‌కు చెందిన ముత్యాల పుష్పావతి నియమితులయ్యారు. గురువారం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతిభీంభరత్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అభివృద్ధితో పాటు ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం పుష్పావతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిని ఇచ్చిన నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. మహిళల్లో చైతన్యం తెచ్చేందుకు కృషి చేస్తానని చెప్పారు.

పత్తివైపు మొగ్గు

- భారీగా పెరగనున్న సాగు విస్తీర్ణం
- రైతులకు అందుబాటులో విత్తనాలు



7

విక్రమ్ సారా భాయ్ సైన్స్ ఫౌండేషన్ పరీక్షలో

జూబ్లీహిల్స్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



జోయెల్ లక్రను అభినందిస్తున్న మురళీముకుంద్

కీసర, జూన్19(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా నిర్వహించే విక్రమ్ సారా భాయ్ సైన్స్ ఫౌండేషన్ పరీక్షలో నాగారం మున్సిపల్ పరిధి జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థి ప్రతిభ చాటాడు. ఇటీవల సైన్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో మూడో తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థులకు స్పాట్ అసెస్మెంట్ ఆన్‌లైన్ ప్రిలిమ్స్‌కు జూబ్లీహిల్స్ స్కూల్ విద్యార్థి జోయెల్ లక్ర రెండుసార్లు అర్హత సాధించాడు. మెయిన్స్ స్పాట్‌లో 100లో నాలుగో స్థానం సాధించి, పుణేలోని లీడింగ్ స్పేస్ సెంటర్‌లో ఐదు రోజులు ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్నాడు. గురువారం స్కూల్ ప్రెసిడెంట్ ఎ. మురళీముకుంద్ జోయెల్‌కపది వేల రూపాయాల నగదు పురస్కారం అందజేశారు. దేశ కీర్తి, ప్రతిష్ఠలు ప్రపంచ వ్యాప్తం చేయాలని ఆకాంక్షించారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

చౌదరిగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ముదిరాజ్‌లు రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాణించాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉద్యోగ సాధికారిత కోసమే మెపాను స్థాపించినట్లు చెప్పారు. త్వరలో మండలంలోని గ్రామాల్లో మెపా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గాలిగూడకు చెందిన శివకుమార్‌ను మెపా మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. సభ్యులకు శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు.





గున్‌గల్ సమీపంలో నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారి పక్కన ధ్వంసమైన పొదల్లో కలిసిపోయిన రెయిలింగ్

ధ్వంసమైన రెయిలింగ్‌లు

● పట్టించుకోని ఆర్అండ్‌బీ అధికారులు

యాచారం, జూన్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గున్‌గల్‌లో నాగార్జునసాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారికి రెండు పక్కల ప్రమాదాల నివారణకు ఏర్పాటు చేసిన హైవే రెయిలింగ్‌లు ధ్వంసమైనా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డు ఎత్తుగా ఉన్న చోట్ల రోడ్డుకు ఇరువైపులా 8ఏళ్ల క్రితం రెయిలింగ్‌లను ఏర్పాటు చేశారు. రహదారిపై ప్రమాదాలు జరిగి వాహనాలు బోల్తాపడి రెయిలింగ్‌లపై పడడంతో అవి ధ్వంసమయ్యాయి. వాహనదారులకు రెయిలింగ్‌లు కనపడకుండా ముళ్ల పొదల్లో కలిసిపోయాయి. దీంతో సూచిక కోసం ఏర్పాటు చేసిన రెయిలింగ్‌లతో ప్రయోజనం లేకుండా పోయింది. డ్రైవర్లకు రోడ్డు ఎత్తు పల్లాలు, మలుపుల గురించి దగ్గరి వరకు వచ్చే దాకా తెలియని పరిస్థితి ఉంది. రోడ్ల పక్కన రెయిలింగ్‌లు ఉంటే వాహనాల డ్రైవర్లు తక్కువ వేగంతో వెళ్తారు. ఎదురుగా వచ్చే వాహనాలను అంచనా వేసుకుంటారు. కొత్త రెయిలింగ్‌ల ఏర్పాటుపై రోడ్లు భవనాల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. పలుచోట్ల ముళ్లపొదలు రోడ్డుపైకొస్తున్నా తొలగించడంలేదు. కలెక్టర్ కల్పించుకొని రెయిలింగ్‌లను ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.

రూ.600కోట్లతో గ్రామీణ రోడ్ల అభివృద్ధి

తలకొండపల్లి, జూన్19(ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలో రూ.600 కోట్లతో గ్రామీణ రోడ్లను ఆధునికీకరిస్తున్నట్టు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గానికి మహర్దశ వచ్చిందన్నారు. కల్వకుర్తి నుంచి గట్టిప్పలపల్లి, రాంపూర్ మీదుగా తలకొండపల్లి వరకు నడిచే ఆర్టీసీ బస్సు సర్వీసును గురువారం డిపో మేనేజర్ సుభాషిణితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని తండాలకు, గ్రామాలకు బీటీరోడ్లు వేస్తామన్నారు. ప్రతీ పల్లెకు బస్సు నడవాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు.



జెండా ఊపి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రద్దీకి అనుగుణంగా డిపోకు కొత్తగా 16 బస్సులను కేటాయించారన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, రేణురెడ్డి, హరిమోహన్‌రెడ్డి, బోల్ల యాదగిరి, షాబుద్దీన్, రాములు, బాల్‌రాజ్, కృష్ణనాయక్, బ్యాంగి ఆనంద్‌కుమార్, వెంకటేష్, పర్వత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భూ ఆక్రమణలపై కఠినంగా ఉండాలి

ఆమనగల్లు: ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కఠినంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. కల్వకుర్తి, ఆమనగల్లు, తలకొండపల్లి, మాడ్గుల, కడ్తాల, వెల్దండ మండలాల్లో విద్యుత్, రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజలు, రైతుల ఇబ్బందులపై తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. నిషేధిత జాబితా భూముల సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణపై నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తేగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని ఫెన్సింగ్ వేయాలని తెలిపారు. అనవసరమైన చోట ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను కోరారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. మంజూరైన సబ్‌స్టేషన్లను త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు లలిత, ముంతాజ్, నాగార్జున, వినయ్‌సాగర్, కార్తీక్, ఇబ్రహీం, సునీత, ట్రాన్స్‌కో డీఈఈలు గోపాల్, శ్రీధర్‌శెట్టి, ఏడీఈలు బాలకృష్ణ, శంకరయ్య, ఏఈలు నరేందర్, శంకర్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, భట్టు కిషన్‌రెడ్డి, బిచ్యానాయక్, జగన్, మోతీలాల్, శ్రీకాంత్‌రెడ్డి, పర్వత్‌రెడ్డి, సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా ఇవ్వాలని ఆందోళన

కీసర, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా నిధులు మంజూరు చేయాలని రైతులు గురువారం దమ్మాయిగూడ మున్సిపల్ పరిధి కీసరలో రైతులు ఆందోళన చేశారు. ప్రభుత్వం జనవరి 26 నుంచి ఇప్పటి వరకు రెండు సార్లు రైతు భరోసా ఇచ్చిందన్నారు. కానీ మేడ్చల్ జిల్లాలో కీసర మండలం భోగారంలో తప్ప, మరే ఇతర గ్రామాల రైతులకు రైతు భరోసా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందరికీ రైతు భరోసా ఇస్తామని చెప్పి ఇప్పుడు విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సరికాదని రైతులన్నారు. దుక్కులు దున్నే సమయమొచ్చిందని, వెంటనే తమకు రైతు భరోసా మంజూరు చేయాలని సొసైటీ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి అధ్వర్యంలో మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు.

యాదవ సంఘం ఆర్థిక సాయం

ఆమనగల్లు, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నారమోని మల్లేశ్‌యాదవ్ కుటుంబానికి ఆమనగల్లు శ్రీకృష్ణయాదవ సంఘం చేయూతనందించింది. అండగా ఉంటామని నాయకులు భరోసా ఇచ్చారు. ఆమనగల్లుకు చెందిన మల్లేశ్ వెల్దండ మండలం చెర్కూర్ గేటు వద్ద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గురువారం అతడి కుటుంబాన్ని సంఘం నాయకులు పరామర్శించారు. సంఘం తరపున రూ.1.5లక్షలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు తోట గిరి యాదవ్, బి.శ్రీశైలం, గిరి, అశోక్, రాములు, నర్సింహ ఉన్నారు.

తెలంగాణ అభివృద్ధిలో కేంద్రానిదే పైచేయి

చౌదరిగూడ/షాద్‌నగర్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): 11ఏళ్ల కాలంలో బీఆర్ఎస్, నేడు కాంగ్రెస్ ప్రభుత్వాలు దోచుకోవడంపై ఉన్న శ్రద్ధ పాలనపై పెట్టలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య ఆరోపించారు. గురువారం కొందుర్గులో బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రచ్చబండ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదకొండేళ్లగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సుస్థిర పాలన అందిస్తున్నారన్నారు. తెలంగాణ అభివృద్ధిలో కేంద్ర ప్రభుత్వానిదే కీలకపాత్ర అన్నారు. జాతీయ రహదారులు, రైల్వేస్టేషన్లు, లైన్ల ఆధునికీకరణ, కొత్త విద్యుత్ లైన్లు వంటివి కేంద్ర ప్రభుత్వమే చేపట్టిందన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలకులు దోచుకోవడమే ఎజెండాగా పనిచేస్తున్నారని విమర్శించారు. నరేంద్రమోదీ వికసిత్ భారత్‌గా మలిచేందుకు అనేక చట్టాలను అమలు చేస్తున్నారన్నారు. ఉచిత సిలిండర్లు, ఉచిత బియ్యం, ఆయుష్మాన్ భారత్, కిసాన్ సమ్మాన్, ఫసల్ బీమా, ఆవాస్ యోజన, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వంటివి అమలు చేశారని వివరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మయ్యగౌడ్, శివారెడ్డి, శ్రీశైలం, బల్వంతరెడ్డి, కురుమయ్య, ప్రశాంత్, అంజయ్య, చంద్రశేఖర్, కార్తీక్‌చారి, సురేష్, రాంచంద్రయ్య, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులలో అందె బాబయ్య మాట్లాడుతూ.. 11ఏళ్లుగా మోదీ అవినీతి రహిత పాలన అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేశ్, బీజేపీ మండలాధ్యక్షుడు పిట్టల వెంకటేశ్ శివశంకర్, కృష్ణ, యాదగిరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర పథకాలపై ప్రజలకు వివరిస్తున్న నాయకుడు బాబయ్య

దాతల సహకారం అభినందనీయం

వికారాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు పనిచేసిన పాఠశాలల అభ్యున్నతికి సహకారం అందించడం అభినందనీయమని సిద్దులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల జీహెచ్ఎం పి.రామకృష్ణారెడ్డి అన్నారు. బడిమాట కార్యక్రమం ముగింపు సందర్భంగా పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. జీహెచ్ఎం రామకృష్ణారెడ్డి చొరవతో నవాబ్‌పేట మండలం పులుమామిడి జెడ్పీహెచ్ఎస్ రిటైర్డ్ జీహెచ్ఎం, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పురుషోత్తంశాస్త్రి పాఠశాలకు రూ.లక్ష విలువ గల వస్తు, సామగ్రిని విరాళంగా అందజేశారు. మైక్ సెట్, ప్రింటర్, 4 ర్యాక్‌లు, ఆఫీస్ టేబుల్, 20 కుర్చీలు, విద్యార్థులకు భోజన ప్లేట్లు, గుర్తింపు కార్డులు, బెల్టులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్‌కుమార్, వెంకటేశ్, రమేశ్, రాజు, సంగీత, శ్రీదేవి, మీనాకుమారి, ఆంజనేయులు, నరేష్, నాగలత పాల్గొన్నారు.



విద్యార్థులు, టీచర్లతో రిటైర్డ్ జీహెచ్ఎం పురుషోత్తంశాస్త్రి, హెచ్ఎం రామకృష్ణారెడ్డి


అట్రాసిటీ కేసుల్లో చర్యలపై డీఎస్పీ నిర్లక్ష్యం

● రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌చైర్మన్‌కు ప్రజాసంఘాల ఫిర్యాదు

తాండూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బెల్కటూర్‌లో దళిత యువకుడి పెళ్లి బారాత్‌ను అడ్డుకొని అవమానించిన వారిని అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకు ఈ మేరకు నాయకులు వినతిపత్రం అందజేశారు. అలాగే చెనిగేష్‌పూర్‌లో ఎరుకల వారి కుటుంబంపై దాడిచేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అట్రాసిటీ కేసుల్లో నిందితులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్న తాండూరు డీఎస్పీపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.మహిపాల్, ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.నర్సింహులు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి మల్కయ్య, నాయకులు బుగ్గప్ప, కృష్ణ, బలరాం, నరేష్, సురేష్, గోపాల్, రమాకాంత్, బస్వరాజ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలందక పశువైద్య సిబ్బంది ఇబ్బందులు

కందుకూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): పశుసంచార అంబులెన్స్ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక పశుసంచార అంబులెన్స్‌ను ప్రవేశపెట్టింది. తాము గ్రామాల్లో పశువులకు చేస్తున్న సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని అంబులెన్స్ వైద్యాధికారి పృథ్వీరాజ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో తిరుగుతూ అనారోగ్యం పాలైన పశువులు, గొర్రెలు, మేకలకు చికిత్సలు అందజేస్తున్నట్టు చెప్పారు. ప్రభుత్వం తమకు వేతనాలు సకాలంలో ఇవ్వడం లేదని, వైద్య పరీక్షలకు కూడా మందులు సరఫరా చేయడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది సాయికిరణ్, నాగరాజు, వెంకటేష్ ఉన్నారు.



పశుసంచార అంబులెన్స్ సిబ్బంది

జీవాలకు సకాలంలో టీకాలు వేయించాలి

షాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గొర్రెలు, మేకలు ఆరోగ్యంగా ఉండేలా కాపరులు జాగ్రత్తలు తీసుకోవాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం హైతాబాద్ తండా, రాంసింగ్ తండాల్లో గొర్రెలు, మేకలకు చిటుక వ్యాధి నివారణ టీకాలు వేశారు. జీవాలు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు టీకాలు, మందులు వేయించాలన్నారు. కాపరులు పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది గోపి, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్యుడు

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి అదృశ్యం.. లొకేషన్ ట్రేస్ చేసి గుర్తించిన పోలీసులు

కేశంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న ఇంట్లోంచి వెళ్లిపోయి అదృశ్యమైన మామిడి శివగౌడ్ కథ సుఖాంతమైంది. పోలీసులు మొబైల్ లొకేషన్ ట్రేస్‌చేసి శివగౌడ్‌ను ఏపీలోని కర్నూల్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన శివగౌడ్ జర్నలిస్టుగా పనిచేస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ గొడవలతో మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఈ నెల 17న వాట్సాప్ స్టేటస్‌లో చనిపోతానంటూ వీడియో పెట్టాడు. దీంతో కుటుంబీకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేశంపేట సీఐ నరహరి, శివగౌడ్ ఫోన్ లొకేషన్ ట్రేస్ చేయించారు. మొదట లొకేషన్ వరంగల్ చూపడంతో కానిస్టేబుల్ అశోక్‌రెడ్డితో కుటుంబీకులను అక్కడికి పంపారు. అక్కడ ఆచూకీ లభ్యం కాక మరోసారి లొకేషన్ ట్రేస్ చేయగా కర్నూల్ రైల్వేస్టేషన్ చూపింది. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి బుధవారం రాత్రి 11గంటలకు శివను అదుపులోకి తీసుకున్నారు. గురువారం గ్రామానికి తీసొచ్చారు. శివగౌడ్ అఘాయిత్యం చేసుకోకుండా వెతికి పట్టుకున్న సీఐ, ఎస్ఐ రాజ్‌కుమార్, పీసీ అశోక్‌రెడ్డిలను గ్రామస్తులు అభినందించారు.



శివను అదుపులోకి తీసుకుంటున్న పీసీ అశోక్‌రెడ్డి

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి జిల్లా కోర్టులు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మేనత్తను హత్య చేసిన నిందితుడికి రంగారెడ్డి జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ గురువారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన ప్రకారం వివరాలు ప్రకారం.. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం చర్లపల్లికి చెందిన ఎరుకల లక్ష్మమ్మ(53), భర్త సత్తయ్య, ఇద్దరు కొడుకులు రాజు, కిరణ్ కుమారులతో హైదరాబాద్ శివార్లలోని ఇంజాపూర్‌లో స్థిరపడ్డారు. సత్తయ్య వాచ్‌మన్‌గా, లక్ష్మమ్మ కూలి చేసుకుంటున్నారు. కాగా లక్ష్మమ్మ అన్న కొడుకు మాదగోని రాజు(29) కారు డ్రైవింగ్ పనిచేస్తూ కమ్మగూడలోని ఇందిరమ్మ కాలనీలో ఉండేవాడు. లక్ష్మమ్మ వద్ద రాజు కొన్ని నెలల క్రితం కొంత డబ్బు తీసుకున్నాడు. అసలు చెల్లించగా మిత్తి ఇవ్వలేదు. మిత్తి డబ్బులు రాజును లక్ష్మమ్మ ఇవ్వాలని పలుమార్లు అడిగింది. ఫిబ్రవరి 17న సాయంత్రం రాజు.. లక్ష్మమ్మ ఇంటికి వచ్చాడు. తనకు రావాల్సిన మిత్తి డబ్బులు ఇవ్వాలనీ ఆమె నిలదీయగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. రాజు సిమెంట్ ఇటుకతో లక్ష్మమ్మ తలపై కొట్టాడు. దీంతో తలపగిలి లక్ష్మమ్మ మృతిచెందింది. లక్ష్మమ్మ కొడుకు ఎరుకల కిరణ్‌కుమార్ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు రాజును రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పూర్వపరాలు పరిశీలించిన రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కర్ణకుమార్ నిందితుడికి జీవిత ఖైదు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి




సమావేశంలో చర్చిస్తున్న ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లో చేపట్టిన రోడ్డు వెడ్పల్పు, రైల్వే బ్రిడ్జి పనులు త్వరగా పూర్తిచేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని నిర్ణయించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో కీసర ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని తదితరులు మాట్లాడారు. యంనంపేట్ చౌరస్తా నుంచి మాధవరెడ్డి రైల్వే వంతెన వరకు వంద అడుగుల రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఇందుకు రూ.30కోట్లు మంజూరయ్యాయని, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధితులకు టీడీఆర్‌లను ఇచ్చి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, తహసీల్దార్, రజని, ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కల్లు దుకాణాల తనిఖీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తుమ్మలపల్లిలో కల్లు దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

చౌదరిగూడ, జూన్19(ఆంధ్రజ్యోతి):జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లోని గ్రామాల్లో కల్లు దుకాణాలను షాద్‌నగర్ ఎక్సైజ్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'కల్లు కాదు.. కాలకూట విషం' శీర్షికన కల్తీ కల్లుపై ప్రచురితమైన కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించారు. కొందుర్గు మండలం లాలాపేట్, చిన్న ఉమ్మెంత్యాల, జిల్లేడ్ చౌదరిగూడ మండలం తుమ్మలపల్లి, చౌదరిగూడల్లోని కల్లు దుకాణాలను తనిఖీ చేసి కల్లు శాంపిల్ తీసుకున్నారు. వాటిని ల్యాబ్‌కు పంపుతామని, హానికారక రసాయనాలు వాడినట్టు నిర్ధారణైతే చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఎస్సై సునీత తెలిపారు.



మోడల్ స్కూల్‌లో సోలార్ గ్రిడ్‌ను ప్రారంభిస్తున్న అమెజాన్ ప్రతినిధులు


విద్య, వైద్యం కోసం 'అమెజాన్' కృషి

షాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే పాఠశాలలో మెరుగైన సదుపాయాల కల్పించాలని అమెజాన్ సీఎస్ఆర్ విభాగాధిపతి తాతాజీ అన్నారు. మండల పరిధి తెలంగాణ మోడల్ స్కూల్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సోలార్ గ్రిడ్‌ను పర్యావరణవేత్త లిబోకోహెన్, రాజేష్ మైసా, రీజినల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ వినియ్‌కుమార్‌లతో కలిసి గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యా, వైద్యం అంశాల్లో సదుపాయాలు కల్పించేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ డబ్బు వెచ్చిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, అమెజాన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను గడువులోగా నిర్మించాలి

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లను గడువులోపు నిర్మించుకోవాలని అదనపు కలెక్టర్ రాధికగుప్తా తెలిపారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధి ఘనాపూర్‌లోని ఇందిరమ్మ ఇళ్లను, ఎదులాబాద్‌లోని అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను గురువారం ఆమె పరిశీలించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. గడువులోపు ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో కవితా యాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మారుతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను సన్మానిస్తున్న బక్కి వెంకటయ్య

వికారాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం వికారాబాద్ వచ్చిన ఆయన ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి సన్మానించారు.

శుభప్రద్‌పటేల్ నివాసానికి బక్కి వెంకటయ్య

ఎస్సీ, ఎస్టీ సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించేందుకు వికారాబాద్‌కు వచ్చిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ నివాసానికి వెళ్లారు. శుభప్రద్.. చైర్మన్ వెంకటయ్య, సభ్యులు రాంబాబునాయక్, జిల్లా శంకర్‌లను సన్మానించి తేనీటి విందు ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్ సుధాంశ్‌కిరణ్ పటేల్, సురేష్‌గౌడ్, దేవదాస్, కేదార్‌నాథ్, శాంతకుమార్, రుక్కుం, సిద్ధిఖి పాల్గొన్నారు.

భూ రిజిస్ట్రేషన్ కోసం శంకర్‌పల్లికి మాజీ సీఎం



తహసీల్దార్ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి

శంకర్‌పల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. భూమి రిజిస్ట్రేషన్ విషయమై ఆయన గురువారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ సురేందర్‌తో కొద్దిసేపు మాట్లాడారు. జన్వాడలోని సర్వే నంబర్ 724లో గల 1ఎకరం 20గుంటల భూమిని ఆయన వేరొకరికి విక్రయించగా, భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకొచ్చారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆయన హైదరాబాద్‌కు వెళ్లిపోయారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

శంకర్‌పల్లి, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్‌లో ఉచిత కంటివైద్య శిబిరాన్ని ప్రారంభించారు. 11వ వార్డులో రూ.31.45 లక్షలతో చేపట్టిన అంతర్గత మురుగుకాలువ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. కమిషనర్ యోగేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ చంద్రమోహన్, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, చంద్రమౌళి, అశోక్, గోపాల్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొందరికే భరోసా!

(ఐదో పేజీ తరువాయి)



చేవెళ్లలో రైతు భరోసా కోసం అధికారుల వద్ద రైతులు

సాయం అందకపోవడంతో విత్తనాల కొనుగోలు భారంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విత్తనాల కొనుగోలు కోసం అప్పులు చేసే పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

9 మండలాల్లో అసలే జమకాని సాయం

జీహెచ్ఎంసీ పరిధిలోని గండిపేట, రాజేంద్రనగర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం, బాలాపూర్, శేరిలింగంపల్లి, హయత్‌నగర్ మండలాల్లోని రైతులకు కనీసం ఒక్కరూపాయి కూడా ఖాతాల్లో జమ కాలేదు. ఈ తొమ్మిది మండలాల్లో పూర్తి వ్యవసాయ భూములు 54 వేల ఎకరాలు ఉండగా, పంటలు సాగు చేస్తున్న భూములు 38,184 ఎకరాలు ఉండగా.. 36,220 మంది రైతులు ఉన్నారు. వీరెవరికీ రైతు భరోసా అందలేదు. ఔటర్‌ను అనుసరించి ఉన్న ఈ మండలాల్లో రియల్ ఎస్టేట్ ఎక్కువగా ఉన్నందున రైతు భరోసాను నిలిపివేసారని ప్రచారం జరుగుతుంది. దీనిపై వెంటనే క్లారిటీ ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మండలాల్లో ఎందుకు పెట్టుబడి సాయం జమకాలేవన్న విషయం వ్యవసాయాధికారులకు కూడా తెలియడం లేదు. ఆలస్యంగా వస్తాయని చెబుతున్నారు. పెట్టుబడి సాయం కోసం బ్యాంకు అధికారులతో పాటు వ్యవసాయాధికారుల చుట్టూ రైతులు తిరుగుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా రావాల్సి ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్లాట్లు, సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. ఇందులో భాగంగానే జీహెచ్ఎంసీ పరిధిలోకి వచ్చే భూములకు రైతు భరోసా నిలిపివేసినట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ప్రతిపక్ష నేతలు రైతులతో కలిసి ఉద్యమానికి సిద్ధమయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి రైతు భరోసా విడుదల చేయాలని కోరారు. స్పందించిన మంత్రి.. అధికారులతో మాట్లాడి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు.

రైతుల ఫోన్లకు జవాబివ్వని అధికారులు

రైతు భరోసా అమలు వ్యవసాయ శాఖకు తలపోటుగా మారింది. జిల్లా వ్యవసాయాధికారి నుంచి మొదలు వ్యవసాయ విస్తరణాధికారుల వరకు రైతుల నుంచి వస్తున్న ఫోన్లకు జవాబివ్వలేకపోతున్నారు. అర ఎకరం, ఎకరన్నరలోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులను కాంగ్రెస్ సర్కార్ మోసం చేసిందని రైతులు ఆరోపిస్తున్నారు. కొంత మంది పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న విస్తీర్ణానికి భిన్నంగా తక్కువగా నగదును ప్రభుత్వం జమ చేసింది. ఎందుకు? ఏమిటీ? అనేదానికి సమాధానం దొరకడం లేదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటి వరకు 4ఎకరాల్లోపు రైతులకు పెట్టుబడి సాయం విడుదల చేసినట్లు వ్యవసాయాధికారులు అధికారికంగా చెబుతున్నారు. కానీ, క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు నెలకొన్నాయి.

ఒక్క మండలానికే సాయం

మేడ్చల్ జిల్లాలో మొత్తం 11 మండలాలు

మేడ్చల్ /ఘట్‌కేసర్, జూన్ 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తొమ్మిది రోజుల్లో రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో ఓఆర్ఆర్ సమీప మండలాల్లో ఇప్పటివరకు ఏ ఒక్క రైతుకు కూడా రైతు భరోసా నిధులు జమ కాలేదు. జిల్లాలో ఆరు గ్రామీణ, ఐదు పట్టణ మండలాల్లో సుమారు 45,103 ఎకరాల విస్తీర్ణంలో 40,443 మంది రైతులు వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. జిల్లాలోని రైతులకు రూ.24కోట్ల రైతు భరోసా నిధులు జమ కావాల్సి ఉంది. జిల్లాలో మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్, దుండిగల్, కుత్బుల్లాపూర్, అల్వాల్ మండలాల్లోని గ్రామాల రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా నిధులు జమ కాలేదు. కేవలం మూడుచింతలపల్లి మండల రైతులకు మాత్రమే రైతు భరోసా నిధులు జమ అయ్యాయి. దీంతో ఆయా మండలాల రైతులు గురువారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరికి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని కలెక్టర్ రైతులకు హామీ ఇచ్చారు. ఆయా మండలాల రైతులకు రైతు భరోసా నిధులు జమ కాకపోవడంపై అధికారులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. బహుశా సిటీ శివారులో ఉండటమే కావచ్చునని చెబుతున్నారు. మరో పక్క జిల్లా పూర్తిగా అర్బన్ ప్రాంతంగా మారింది. స్థానిక సంస్థల(సర్పంచ్, ఎంపీటీసీ) ఎన్నికలు లేని కారణంగా రైతు భరోసా నిధులు విడుదల కావడం లేదనే ప్రచారం కూడా జరుగుతున్నది. జిల్లాలో నాలుగో రోజు రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ అయినట్లు జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ గురువారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 4,624 మంది రైతులకు రూ.3.18 కోట్లు జమ అయినట్లు పేర్కొన్నారు.

కలెక్టర్ తీరుపై బీఆర్ఎస్ విమర్శలు

మేడ్చల్ - మల్కాజిగిరి కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి తీరుపై గురువారం బీఆర్ఎస్ నాయకుల విమర్శలు సోషల్ మీడియాలో వెల్లువెత్తాయి. రైతుభరోసా నిధులపై తనను కలిసేందుకు వచ్చిన రైతులను కలెక్టర్ కనీసం కూర్చోపెట్టకుండా అగౌరపర్చారని, మరోపక్క తనను సన్మానించేందుకు వచ్చిన కాంగ్రెస్ నాయకులను కూర్చోబెట్టి రాచమర్యాదలు చేశారనే విమర్శలు టీవీలు, సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. 'ఇదేనా ఒక యువ కలెక్టర్ తీరు.. కలెక్టర్ కాంగ్రెస్‌కు దాసోహం' అంటూ విమర్శలు చేశారు.

రైతు భరోసా రాకపోవడంపై నిరసన

ఇబ్రహీంపట్నం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 9 మండలాల్లో రైతు భరోసా నిలిపివేయడంపై బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద రైతులతో కలిసి రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. సాగు భూములకే రైతు భరోసా అంటూ ఔటర్‌ను అనుసరించి ఉన్న మండలాల్లో ఈ సాయాన్ని నిలిపివేయడమేమిటంటూ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి ప్రశ్నించారు. నిరసనకారులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో గోదల శేఖర్‌రెడ్డి, ముత్యాల మహేందర్, నేముల దయానంద్‌గౌడ్, ముత్యాల భాస్కర్, నాయిని సత్యనారాయణ, అంజయ్య యాదవ్, పోరెడ్డి అర్జున్‌రెడ్డి, పాపయ్యగౌడ్, టేకుల రాంరెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లాలో రూ.165.79కోట్లు

ప్రస్తుత వానాకాల సీజన్‌లో 2,06,526 మంది రైతులకు రూ.165.79 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశారు. 2024-25 యాసంగిలో 2,18,418 మంది రైతులకు రూ.177.61 కోట్లు రైతుల ఖాతాల్లో జమ అయ్యాయి. గత ఏడాదితో పోల్చితే ఇంకా 11,892 మందికి రైతు భరోసా జమ కావాల్సి ఉంది. వీరంతా పెట్టుబడి సాయం కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారు. సకాలంలో పెట్టుబడి సాయం అందకపోతే పనులు ఆలస్యమై దిగుబడులపై ప్రభావం చూపుతుందని ఆందోళన చెందుతున్నారు. రైతు భరోసా అందని వారు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

ఒక్క రూపాయి రాలే..



నా భార్య పేరిట 1.01 ఎకరాల భూమి ఉంది. ప్రధాని మోదీ వేస్తున్న పెట్టుబడి సాయం అందుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం రూపాయి కూడా పెట్టుబడి సాయం అందలే. పలు మార్లు వ్యవసాయాధికారులకు తెలిపినా, అవసరమైన పంట పాసుబుక్కు వంటి పత్రాలు అందించాను. సాయం అందలే. వస్తదనే నమ్మకం లేకుండా పోతుంది. ఉన్నతాధికారులు స్పందించి రైతు భరోసా వచ్చేలా చూడాలి.

అశోక్ చారి, కౌకుంట్ల రైతు


ఎమ్మెల్యే వద్దన్నా.. టెండర్ లేకుండా!

- రూ.అరకోటి శానిటేషన్ మెటీరియల్ ఆర్డర్
- హాకాకు కట్టబెట్టిన మునిసిపల్ కమిషనర్

తాండూరు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో రూ.అరకోటి పెట్టి కొన్న మెటీరియల్‌పై దుమారం రేగుతోంది. ఎక్స్ ఆఫీషియో సభ్యుడైన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి తెలియకుండానే ఈ వ్యవహారం జరగడంపై కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. మున్సిపాలిటీలో టెండర్ లేకుండా రూ.50 లక్షల శానిటేషన్ మెటీరియల్ కొన్నారు. హాకా కంపెనీకి నామినేషన్ విధానంపై అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) అనుమతితో మెటీరియల్ సప్లయ్ కాంట్రాక్ట్ కట్టబెట్టారు. అది కూడా కాంట్రాక్టర్‌కే అప్పగించడం గమనార్హం. గతంలో ఇదే సంస్థ నుంచి శానిటేషన్ మెటీరియల్‌ను రూ.40లక్షలకు కొనేందుకు సమావేశంలో చర్చించగా అంత మొత్తం అవసరంలేదని కౌన్సిలర్లు తిరస్కరించారు. ఈ కాంట్రాక్ట్ చేసుకోవద్దని ఎమ్మెల్యే సైతం కమిషనర్‌ను ఆదేశించారు. ఐదు నెలలు తిరక్కుండానే రూ.10లక్షలు పెంచి అంతే మెటీరియల్ కొనుగోలుకు ఆర్డరివ్వడం ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. స్టాండింగ్ కౌన్సిల్ లేని సమయంలో ఎమ్మెల్యే దృష్టికైనా తేకుండా పెద్ద మొత్తంలో వర్క్ ఆర్డర్ ఇవ్వడంలో ఎవరి హస్తం ఉందన్న దానిపై పట్టణ కాంగ్రెస్ నాయకులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే కొంత మెటీరియల్ మునిసిపల్ కార్యాలయానికి చేరింది. ఇదిలా ఉంటే గతంలో హాకా సరఫరా చేసిన మెటీరియల్ నాసిరకంగా ఉందనే విమర్శలున్నాయి. బల్దియాలో ఉన్న 200 మంది కార్మికులకు ఇచ్చే మెటీరియల్‌కు ఇంత ఖర్చువుతుందా? అన్న చర్చా నడుస్తోంది.

ఒక్క రోజులో ఆలయాల సందర్శన

- ఆర్టీసీ ఆధ్వర్యంలో టూర్ ప్యాకేజీ
- హకీంపేట ఆర్టీసీ డీఎం భవభూతి



శామీర్‌పేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల సందర్శనకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నామని శామీర్‌పేట ఆర్టీసీ డిపో మేనేజర్ భవభూతి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 27 నుంచి తెలంగాణాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించే విధంగా బస్సు సర్వీసులను నడుపుతున్నట్టు తెలిపారు. ప్యాకేజీ-1లో భాగంగా శామీర్‌పేట మండలంలోని రత్నాలయం, మజీద్‌పూర్ వేంకటేశ్వరాలయం, సిద్దిపేట జిల్లా వర్గల్ సరస్వతీ ఆలయం, కొమురవెల్లి మల్లన్న, కొలనుపాక శివాలయం, బుద్ధ దేవాలయం, భువనగిరి సమీపంలోని స్వర్ణాలయాల సందర్శన ఉంటుందన్నారు. ఇందుకు పెద్దలకు రూ.500, పిల్లలకు రూ.350 చార్జి ఉంటుందని తెలిపారు. ఈ బస్సు ఉదయం 6గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. అలాగే ప్యాకేజీ-2లో వరంగల్ రామప్ప ఆలయం, లక్నవరం సరస్సు, వరంగల్ భద్రకాళి ఆలయం. వేయి స్తంభాలగుడి, స్వర్ణగిరి ఆలయాల సందర్శనం ఉంటాయన్నారు. ఈ ప్యాకేజిలో పెద్దలకు రూ.830, పిల్లలకు రూ.450 చార్జి ఉంటుందన్నారు. బస్సు ఉదయం 4గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరుతుందని వివరించారు. ఆలయాల సందర్శన అనంతరం తిరిగి స్టేషన్‌లో దించుతామని తెలిపారు. మరిన్ని వివరాలకు భక్తులు 9959226144, 9063816338 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కాగా ప్రత్యేక ప్యాకేజీలో మహాలక్ష్మి పథకం(మహిళలకు ఉచిత ప్రయాణం) వర్తించదని డీఎం చెప్పారు.

పత్తివైపు రైతుల మొగ్గు

- భారీగా పెరగనున్న తెల్లబంగారం సాగు విస్తీర్ణం



చేవెళ్లలో పత్తి విత్తుతున్న మహిళలు

చేవెళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం రైతులు పండించిన పంటలకు చాలావాటికి ధర తక్కువ ఉండేది. ఒక్క పత్తి ధర మాత్రమే నిలకడగా ఉంది. ఈ నేపథ్యంలో పత్తిసాగుపై ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. ఇటీవలి వర్షాలకు డివిజన్‌లోని చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో పత్తి పంట 37,045 ఎకరాల్లో సాగు చేశారు. ఇదిలా ఉంటే 62,440 ఎకరాల్లో పత్తి వేస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. రైతులకు అవసరమైన బీటీ-2 రకం పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. బీటీ-2 రకం విత్తనాల ప్యాకెట్ ఏ కంపెనీ అయినా ప్యాకెట్ ధర రూ.901కి అమ్మాలని విత్తన వ్యాపారులకు అధికారులు సూచించారు. అధిక ధరలకు అమ్మితే డీలర్లపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. అధికారులు ఫర్టిలైజర్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ నాసిరకం విత్తనాలు అమ్మకుండా చర్యలు తీసుకుంటున్నారు.

లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే విత్తనాలు కొనాలి



లైసెన్స్ ఉన్న ఎరువులు, విత్తనాల డీలర్ల వద్దనే పత్తి, మొక్కజొన్న ఇతర విత్తనాలు కొనుగోలు చేయాలి. వాటికి రసీదు తప్పక తీసుకోవాలి. పత్తి ప్యాకెట్ ధర రూ.901 ప్రభుత్వం నిర్ణయించింది. అధిక ధరలకు అమ్మినా, నాసిరకం విత్తనాలు విక్రయించినా లైసెన్స్ రద్దు చేస్తాం.

- శంకర్‌లాల్, ఏవో, చేవెళ్ల

సామాజిక తనిఖీల్లో సమగ్ర వివరాలు సేకరించాలి

తాండూరు రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధి గ్రామాల్లో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందాలు సమగ్ర వివరాలను సేకరించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ కొమరయ్య అన్నారు. గురువారం మండల పరిషత్‌లో ఎంపీడీవో విశ్వప్రసాద్ అధ్యక్షతన 16వ సామాజిక తనిఖీ బృందం సభ్యులతో సమావేశం నిర్వహించారు. 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు చేసిన పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ కాలంలో రూ.6.12కోట్లు కూలీలకు చెల్లింపులు, పనిముట్లు, ఇతర సామగ్రి కొనుగోళ్లకు రూ.3.58కోట్లు వెచ్చించినట్టు తేల్చారు. పనుల్లో అవినీతి జరిగిందా? పనులు అసంపూర్తిగా ఉన్నాయా? లెక్కల్లో తేడాలున్నాయా? అనే అంశాలపై 16 మంది డీఆర్పీలు గ్రామాల్లో వారంపాటు తనిఖీ నిర్వహిస్తారన్నారు. తనిఖీ బృందాలకు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది, కూలీలు సహకరించి వివరాలందజేయాలని సూచించారు. ఎంపీడీవో మాట్లాడుతూ.. పంచాయతీ కార్యదర్శులు తనిఖీ బృందాలకు పనులు చేసిన ప్రదేశాలను చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీవో నరోత్తంరెడ్డి, డీఆర్పీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.



విలేఖరుల సమావేశంతో మాట్లాడుతున్న జగన్

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విష ప్రచారాలు

ఆమనగల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విషప్రచారాలకు ఒడిగట్టారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు తెల్లమల్ల జగన్, పట్టణాధ్యక్షుడు వస్పుల మానయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు అన్నారు. ప్రగతి నిరోధకంగా మారిన విపక్షాలకు స్థానిక ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మార్కెట్ యార్డ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ తోడ్పాటు, అమలుచేస్తున్న పథకాలతో పేదలు కష్టాల నుంచి బైటొలిగి సంతోషంగా జీవిస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు స్థానిక ఎన్నికల్లో ఉనికి కోసం ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు సాగిస్తూ ప్రజలను తప్పు దోవపట్టిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా అర్హులైన రైతులందరికి రైతు భరోసా పెట్టుబడి సాయం సంవత్సరానికి ఎకరాకు రూ.12 వేలు అందిస్తుందని చెప్పారు. రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని వారు సూచించారు. స్థానిక ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ కనుమరుగు కాక తప్పదన్నారు. విపక్షాల కుట్రలను పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని పిలుపు నిచ్చారు. ఏఎంసీ డైరెక్టర్ శ్రీశైలం, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర కార్యదర్శి ఫరీద్, కాంగ్రెస్ జిల్లా,మండలనాయకులు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి,దారెడ్డి అంజన్‌రెడ్డి, కృష్ణానాయక్, అలీం, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

శంషాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో పలు బస్తీల్లో నేడు(శుక్రవారం) విద్యుత్ సరపరా నిలిపివేస్తున్నట్లు శంషాబాద్ విద్యుత్ సబ్-స్టేషన్ ఏఈ అఫ్జర్‌బాష ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు గంటల వరకు కొత్వాల్‌గూడ ఫీడర్ పరిధి, 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 11 కేవీ పరిధిలోని నర్కేడ ఏజీఎల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కొత్వాల్‌గూడ, మర్లగూడ, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు, ఆర్కే గార్డెన్, అమ్మపల్లి, కవ్వగూడ ప్రాంతాల్లో మెయింటెనెన్స్ కోసం చెట్లను నరికేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళనకు కృషి

షాబాద్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన తప్పులను సరిచేసేందుకు రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేసి, భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళుతున్నామని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గురువారం షాబాద్‌లోని పీఆర్ఆర్ మినీ స్టేడియంలో తహసీల్దార్ అన్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల వద్దకే రెవెన్యూ నినాదంతో భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. మాజీ సర్పంచులు



చేవెళ్ల : ఫిర్యాదులు స్వీకరిస్తున్న తహసీల్దార్ కృష్ణయ్య

జనార్దన్‌రెడ్డి, నరేందర్, మాజీ ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు చేవెళ్ల స్వామి, సుభాష్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సూర్యగౌడ్, రాహుల్‌గుప్తా, రాఘవేందర్, ఏకాంబర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గౌరీశ్వర్, రాజేందర్‌రెడ్డి, శ్రీనివాసాచారి తదితరులున్నారు.

చేవెళ్ల : భూ భారతి చట్టంపై రైతులు అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ బి.కృష్ణయ్య తెలిపారు. గురువారం రావులపల్లి గ్రామంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులు భూ భారతి చట్టంపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. రైతుల ఫిర్యాదులను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట : ఫర్టిలైజర్ షాపులో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఏవో శిరీష

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

చేవెళ్ల/కేశంపేట, జూన్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రైతులకు అధిక ధరలకు ఎరువులు, మందులు అమ్మితే కేసులు నమోదు చేస్తామని చేవెళ్ల మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్ తెలిపారు. గురువారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని అన్ని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి ఎరువులు, విత్తనాల స్టాక్ వివరాలను సేకరించారు. ఆయన మాట్లాడుతూ వ్యాపారులు రైతులకు నకిలీ మందులు, విత్తనాలు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే వ్యాపారులు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించాలని కేశంపేట ఏవో శిరీష సూచించారు. మండల కేంద్రంలో సీడ్, ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టిక, గోదాంలో నిల్వలను స్టాక్ రిజిస్టర్‌తో సరిపోల్చుకున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఆదిభట్ల/చేవెళ్ల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహ అన్నారు. ఈమేరకు గురువారం మున్సిపల్ కార్మికులతో కలిసి కమిషనర్ బాలకృష్ణకు సమ్మె నోటీసు అందజేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. కాంట్రాక్ట్ విధానం రద్దుచేసి, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మికులకు రూ.26వేల వేతనమివ్వాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి స్థలాలు కేటాయించాలన్నారు. మల్లారెడ్డి, సదానంద్, రాజశేఖర్, మహేందర్, అశోక్, రమేష్ తదితరులున్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం చేవెళ్లలో మున్సిపల్ కార్యాలయం ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ డివిజన్ ఉపాధ్యక్షుడు మంజుగల ప్రభుదాస్, చేవెళ్ల పట్టణ కార్యదర్శి సీహెచ్ నరేష్, నాయకులు జనార్దన్, నరసింహ, భాస్కర్, మహమ్మద్ రఫీ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఆదిభట్ల : నోటీసు ఇస్తున్న నర్సింహ తదితరులు

ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు



చేవెళ్ల : రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

కడ్తాల్/ఆమనగల్లు/తలకొండపల్లి/మొయినాబాద్/కందుకూరు/మహేశ్వరం/శంషాబాద్/చేవెళ్ల/షాబాద్/నందిగామ/కేశంపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీని ప్రధానిని చేసేవరకు కాంగ్రెస్ శ్రేణులంతా విశ్రమించకుండా పోరాడాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. కడ్తాల మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహుల ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీజన్మదిన వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లక్‌పతి నాయక్, జహంగీర్‌బాబా, సత్యంయాదవ్,జవహర్‌లాల్ నాయక్, తదితరులున్నారు. ఆమనగల్లు పట్టణంలో రాహుల్ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, పట్టణాధ్యక్షుడు మానయ్యల ఆధ్వర్యంలో రాజీవ్ చౌక్ వద్ద నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు అతిథులుగా హాజరయ్యారు. పార్టీ నేతలతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఎం.ఏ ఖలీల్, వస్పుల శ్రీశైలం, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కానుగుల దశరథం, వస్పుల శ్రీకాంత్, ఎంగలిప్రసాద్, తదితరులున్నారు. తలకొండపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. పార్టీ నేతలతో కలిసి కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్ రెడ్డి, ఓంకారం, రంగారెడ్డి, రవీందర్, అజీమ్, రాములు, బోళ్ల యాదగిరి, తదితరులున్నారు. రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు మొయినాబాద్‌లో నిర్వహించారు. పీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. రాంరెడ్డి, మహేందర్ ముదిరాజ్, రాజుగౌడ్ తదితరులున్నారు. కందుకూరు గురువారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొడపు వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి కేక్ కట్ చేశారు. అఫ్జల్‌బేగ్, సుధాకర్‌రెడ్డి, రాంరెడ్డి, సంజీవరెడ్డి, శేఖర్‌గౌడ్, పాండురంగారెడ్డి, ప్రశాంత్‌కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు న్నారు. మహేశ్వరం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిల్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు జరిగాయి. తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ నాయకులు రక్తదానం చేశారు. పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, బొక్క జంగారెడ్డి, యాదయ్య, గోపాల్‌రెడ్డి, సుభాన్‌యాదవ్ తదితరులున్నారు. కాంగ్రెస్ శంషాబాద్ మండల శాఖ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్ శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. జె.నరేందర్, సంజయ్‌యాదవ్, నాగేందర్‌రెడ్డి, లింగంగౌడ్, మిట్టు, లింగంయాదవ్ ఉన్నారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య అధ్యక్షతన చేవెళ్ల పట్టణ కేంద్రంలో వేడుకలు నిర్వహించారు. చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల, మోడల్ స్కూల్‌లో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన 11మంది విద్యార్థులకు రూ.5వేల చొప్పున మొత్తం రూ.55 వేల నగదు పురస్కారం అందించారు. పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్‌చైర్మన్ రాములు, చేవెళ్ల పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ మర్పల్లి మాలతి కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, మోహన్‌రెడ్డి, ప్రభాకర్, మాజీ ఎంపీటీసీలు రాములు, రవీందర్‌రెడ్డి, నాయకులున్నారు. శంకర్‌పల్లిలో అరుణోదయ యువజన సంఘంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు ప్రకాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రమోహన్. అరుణోదయ యువజన సంఘం అధ్యక్షుడు పాండురంగారెడ్డి. నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకట్‌రాంరెడ్డి, చంద్రమౌళి ఉన్నారు. గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ చంద్రశేఖర్ షాబాద్‌లో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేశారు. మాజీ సర్పంచులు జనార్దన్‌రెడ్డి, నరేందర్, ఎంపీటీసీలు చెన్నయ్య, అశోక్, సర్దార్‌నగర్ ఏఎంసీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు చేవెళ్ల స్వామి, సుభాష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తదితరులున్నారు. నందిగామ మండలకేంద్రంలో నాయకులు కేక్ కట్‌చేశారు. మండలాధ్యక్షుడు నర్సింలు, మాజీ ఎంపీటీసీలు కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రాజగోపాల్ నాయకులు జిల్లెల్ల బాల్‌రెడ్డి, రాములు, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేశంపేట, మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట రాహుల్ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు వై.గిరిధర్ యాదవ్, మహిళా అధ్యక్షురాలు రాణి, శ్రీధర్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, పర్వతాలు, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం : రక్తదానం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాసుమల్లగూడ అభివృద్ధికి కృషి

షాద్‌నగర్ రూరల్, జూన్19(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్ మండలం రాసుమల్లగూడ గ్రామాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ తెలిపారు. రాసుమల్లగూడ గ్రామానికి మంజూరైన చౌక ధరల దుకాణంను గురువారం ఆయ న ప్రారంభించారు. అలాగే రూ.45లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. నాగులపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. అంతర్గత మురుగు కాలువలు నిర్మాణం చేయడం జరుగుతుందని తెలిపారు. నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, అశోక్, కృష్ణారెడ్డి, రాములు గౌడ్, పాండు గౌడ్, నర్సింహచారి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : డాక్టర్ వెంకటరమణను అభినందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

డాక్టర్ వెంకటరమణను అభినందించిన ఎమ్మెల్యే

షాద్‌నగర్ అర్బన్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో ప్రజలకు వైద్యసేవలందించి, ఓ యూట్యూబ్ ఛానల్ నుంచి ఉత్తమ సేవా అవార్డునందుకున్న డాక్టర్ మిర్యాల వెంకటరమణను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అభినందించారు. కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం షాద్‌నగర్‌లోని వెంకటరమణ ఆసుపత్రికి వెళ్లి ఆయన్ను సన్మానించారు.

ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలి

యాచారం, జూన 19(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొనాలంటే ప్రతీ ఒక్కరు దైవభక్తి కలిగి ఉండాలని శ్రీహంపి విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి వెల్లడించారు. తక్కళ్లపల్లితండాలో బం గారు మైసమ్మ అమ్మవారి ఆలయ పంచమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతీ రోజు యోగా, ధ్యానం చేసుకోవడం అలవాటు చేసుకోవాలన్నారు. కాగా, అమ్మవారి ఆలయం నిర్మించి నిత్యం ప్రత్యేక పూజలు చేయడం, వార్షికోత్సవం నిర్వహించడం అభినందనీయమని ఎవరెస్ట్ పర్వతారోహకుడు ఆంగోత్ తుకారంను అభినందించారు.



హోమం నిర్వహిస్తున్న విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి

హక్కుల సాధనకు పోరాడదాం

చౌదరిగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసం అందరూ సమిష్టిగా పోరాడాలని బీసీ సేన రాష్ట్ర నాయకులు వెంకటేష్ అన్నారు. గురువారం కొందుర్గు మండల అధ్యక్షురాలు అనిత గౌడ్ ఆధ్వర్యంలో లాలాపేట్ లో బీసీ సేన నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం బీసీల ఐక్యత ఎంతో అవసరమన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. లాలాపేట్ బీసిసేన గ్రామ కమిటి అధ్యక్షురాలుగా మంజుల, ఉపాధ్యక్షురాలుగా సత్యమ్మ, కార్యదర్శిగా సునిత కోశాధికారిగా మంజుల పాటు కొంత మంది మహిళలను కమిటి సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. బీసీ సేన నాయకులు తదితరులున్నారు.

పుట్టోనిగూడలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలి

తహసీల్దార్ ఆజంఅలీకి గ్రామస్థుల వినతి

కేశంపేట, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుట్టోనిగూడ గ్రామంలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని గ్రామ ప్రజలు గురువారం కేశంపేట తహసీల్దార్ ఆజంఅలీకి వినతిపత్రం అందజేశారు. సంగెం గ్రామంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులో తహసీల్దార్‌ను కలిసిన గ్రామస్థులు లిఖితపూర్వకంగా వినతిపత్రం అందించారు. పుట్టోనిగూడ గ్రామంలోని రేషన్ కార్డు లబ్ధిదారులు, సంగెంలోని రేషన్ దుకాణానికి మూడు కిలో మీటర్లు నడిచి వచ్చి సరుకులు తీసుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధులు, ఒంటరి మహిళలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పాల్కోనిగుట్టతండాలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని తండావాసులు వినతిపత్రం అందించారు.

అట్టహాసంగా అర్జున్‌రావు జన్మదిన వేడుకలు

ఆమనగల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలో గురువారం అట్టహాసంగా నిర్వహించారు. బస్టాండ్ ఎదుట నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు నేనావత్ పత్యనాయక్, మండల నాయకులతో కలిసి అర్జున్‌రావు కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు చోట్ల మొక్కలు నాటారు. పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అర్జున్‌రావును నాయకులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలో పెద్ద ఎత్తున బాణసంచా పేల్చి శెట్టిపల్లి నాయకులు, అభిమానులు సందడి చేశారు. మాజీమంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, సబితా రెడ్డి, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు అర్జున్‌రావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్‌రావు, శ్రీను నాయక్, పంతూ నాయక్, కమటం వెంకటయ్య, వెంకటేశ్, పరమేశ్, కేశవులు, జంగయ్య, శ్రీనివాస్, శేఖర్, శంకరయ్య, రైజల్, శేఖర్, రంగయ్య, లక్ష్మణ్, సత్యం, మహేశ్, గణేశ్, యాదగిరి, పాండు, శంకర్, వెంకటయ్య, కుమార్, బాల్‌రాజ్, జంగయ్య, అభిలాష్, పరమేశ్, శ్రీను, గుత్తి బాలస్వామి, సాయిలు, రాంచంద్రయ్య, రాములు, తదితరులు పాల్గొన్నారు.



అర్జున్‌రావును సన్మానిస్తున్న నాయకులు

సంక్షిప్తంగా..

మొయినాబాద్ : మొయినాబాద్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం 20 మంది విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. విద్యా స్వేచ్ఛాఫౌండేషన్ హైదరాబాద్ వారి సహకారంతో పాఠశాలలో చదువుతున్న 250 మంది విద్యార్థులకు ఉచితంగా నోటుపుస్తకాలు, స్లేట్స్, స్టేషనరీ అందజేశారు. ఎంఈవో మల్లయ్య, స్వేచ్ఛాఫౌండేషన్ చైర్మన్ వాసు దేవ్, సభ్యులు శేశగిరిరావు, తదితరులున్నారు.

చేవెళ్ల : ధర్మసాగర్, గొల్లపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేవెళ్ల పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం ధర్మకర్త శ్రీపాదు తన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధర్మకర్త పూజారి శ్రీపాదు మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూతనిచ్చేందుకు గాను తోచిన సహాయం చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని సూచించారు.

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని తుమ్మలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మండల విద్యాశాఖ అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలను అందజేశారు. తుమ్మలపల్లికి చెందిన దివంగత సలీం పటేల్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా విద్యార్థులకు షూస్ అందజేశారు.

మాడ్గుల : నల్లచెరువులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు భూమిపూజ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని నాయకులు వడ్డేపల్లి నవీన్ గౌడ్, బోదాసు వెంకటయ్యలు లబ్ధిదారులకు సూచించారు.

బదిలీ అయిన అధికారులకు సన్మానం

ఆమనగల్లు, జూన్ 19(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో పని చేసి బదిలీపై వెళ్తున్న ఏఎస్ఐ బాల్ రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్, నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఎస్ఐ రాంరెడ్డిలకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ మండలాధ్యక్షుడు ఎర్రవోలు శ్రీను, మున్సిపాలిటీ అధ్యక్షుడు కర్నాటి విక్రమ్‌రెడ్డిలు పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. జగన్, అంజి, వెంకటేశ్ , సీతారామ్, యాదగిరి, బాలునాయక్, శివ, భరత్, రవిరాథోడ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.



క్రైం కార్నర్

అదుపు తప్పి బొలెరో వాహనంపై పడిన లారీ

● తప్పిన పెను ప్రమాదం

చౌదరిగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనంపై లారీ పడిన ఘటన కొందుర్గు మండల పరిధిలోని శ్రీరంగాపూర్ గురువారం ఉదయం చోటుచేసుకుంది. కొందుర్గు ఎస్సై రవీందర్‌నాయక్ కథనం మేరకు.. ఫరూక్‌నగర్ మండలం కాంసాన్‌పల్లికి చెందిన కొర్ర దశరథ్ ఆరేళ్లుగా మొగిలిగిద్ద గ్రామానికి చెందిన ముక్తారుద్దీన్ వద్ద బొలెరో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం బొలెరోను తీసుకొని వికారాబాద్‌కు మొక్కజొన్నల లోడ్ చేసేందుకు వెళ్తుండగా 10గంటల సమయంలో కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ స్టేజీ వద్ద టిఫిన్ చేసేందుకు రోడ్డు పక్కన వాహనాన్ని నిలిపాడు. ఈక్రమంలో షాద్‌నగర్ నుంచి కొందుర్గు వైపు లోడ్‌తో వస్తున్న లారీ చిన్నఎల్కిచర్ల వైపు యూటర్న్ తీసుకుంటుండగా అదుపు తప్పి బొలెరోపై పడింది. దాంతో వాహనం ముందు భాగం దెబ్బతింది. డ్రైవర్ ఫిర్యాదు మేరకు లారీడ్రైవర్ శ్యాంకుమార్‌పై కేసు నమోదు చేశారు.

స్తంభాన్ని ఢీకొని బొలెరో బోల్తా

కడ్తాల్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో బొలెరో వాహనం బోల్తా పడిన సంఘటన కడ్తా ల మండలం గోవిందాయిపల్లి తండా గేటు వద్ద హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆగాపల్లి నుంచి దాణా లోడ్‌తో నాగర్‌కర్నూల్ వెళ్తున్న బొలెరో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దాంతో స్తంభం విరిగి తీగలు కింద పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. పోలీసులు వివరాలు సేకరించారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్.. ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తూర్, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో జేపీ దర్గా రోడ్డుపై గురువారం బైక్‌ను టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని పోలీసులు తెలిపారు. నందిగామ మండలం మేకగూడకు చెందిన నరేష్(35), అతడి నానమ్మ బక్కమ్మ(75)లు కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా, ఇన్ముల్‌నర్వ వైపు వెళ్తున్నారు. ఈక్రమంలో టిప్పర్ మలుపు తిరుగుతూ ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. నరేష్ సోదరుడు గణేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

చౌదరిగూడ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): బొలెరో వాహనం బైక్‌ను ఢీకొనడంతో ఓ యువకుడికి గాయాలైన ఘటన గురువారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై విజయ్ కథనం మేరకు.. ఎదిర గ్రామానికి చెందిన బుచ్చనోళ్ల శివానంద్ బైక్‌పై పీర్జాపూర్ నుంచి స్వగ్రామానికి వస్తుండగా వెనుక నుంచి అశోక్ లేలాండ్ వాహనం ఢీకొనడంతో కిందపడిపోయాడు. తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు ఆసుపత్రికి తరలించారు. ఈమేరకు బొలెరో డ్రైవర్ సౌరబ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బైక్ అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తికి గాయాలు

మాడ్గుల, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలకొండ జీపీ పరిధి గోప్యతండాకు చెందిన రత్‌లావత్ శ్రీనునాయక్ కలకొండ నుంచి మాడ్గుల తహసీల్దార్ కార్యాలయానికి వెళుతుండగా బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. దాంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. కలకొండ-మాడ్గుల మార్గంలో కల్వర్టు దాటుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెట్రోలింగ్ పోలీసులు 108 అంబులెన్స్‌లో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

నందిగామ, జూన్ 19(ఆంధ్రజ్యోతి): మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. వికారాబాద్ జిల్లా, కుల్కచర్ల మండలం, చర్లపురం తండాకు చెందిన ముడావత్ రేష్మ భర్తకు దూరంగా ఉంటూ తన నాలుగేళ్ల కుమారుడితో నందిగామ మండల కేంద్రంలోని అయ్యప్ప టెంపుల్ కాలనీలో అద్దె ఇంట్లో నివాసముంటూ కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తోంది. బుధవారం రాత్రి ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడంతో ఇంటి యజమాని వెంకటేష్ పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తమ్ముడు గోవిందు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మొయినాబాద్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): స్నేహం చేస్తున్నట్లు నటించి.. అతిగా మద్యం తాగించి ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడు కటకటాలపాలయ్యాడు. మొయినాబాద్ సీఐ పవన్‌కుమార్‌రెడ్డి కథనం మేరకు.. మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గడ్‌కు చెందిన దుర్గేశ్‌సాహు(39) హత్యకు గురైన సంగతి తెలిసిందే. పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆసక్తికర విషయాలు బయటకు వచ్చాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన తరుణ్ బసేనా(29), మండల పరిధిలోని కనకమామిడి రెవెన్యూ పరిధిలోని ఓ ఫాంహౌస్‌లో హత్యకు గురైన దుర్గేశ్‌సాహు పనిచేస్తున్న చోటే కూలీగా పనిచేస్తున్నాడు. ఆరు నెలల క్రితం దుర్గేశ్‌సాహు భార్య మృతిచెందింది. అనంతరం తరుణ్ బసేనా భార్యతో అనుచితంగా ప్రవర్తించడంతో పలుమార్లు హెచ్చరించాడు. అయినా దుర్గేశ్‌సాహు ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో మూడు రోజులక్రితం ఫామ్‌హౌస్‌లోనే విందు చేసుకుందామని పిలిచి పూటుగా మద్యం తాగారు. అనంతరం ఇద్దరి మధ్య గొడవ జరిగింది. కోపోద్రిక్తుడైన తరుణ్ బసేనా.. రాయితో దుర్గేశ్ సాహు తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మొయినాబాద్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

గ్యాస్ సిలిండర్ ఇప్పిస్తానని.. రూ.1500లతో ఉడాయించిన దుండగుడు

యాచారం, జూన్ 19 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ తీసుకునేందుకు గ్యాస్ ఏజెన్సీకి వద్దకు వెళ్లిన వృద్ధ దంపతులను ఓ కేటుగాడు బురిడీ కొట్టించి డబ్బులు తీసుకుని పరారయ్యాడు. అయ్యవారిగూడకు చెందిన నక్క పండరి, పార్వతమ్మలు మండల కేంద్రంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్దకు సిలిండర్ తీసుకునేందుకు గురువారం వెళ్లారు. మధ్యాహ్న సమయంలో షట్టర్ కిందికివేసి సిబ్బంది భోజనం చేస్తున్నారు. వృద్ధ దంపతులు బయట వేచి ఉన్నారు. గమనించిన దుండగుడు తాను ఇక్కడే పని చేస్తానని నమ్మించి రూ.1500 తీసుకున్నాడు. సిలిండర్ మీ ఇంటికే పంపిస్తామని చెప్పి బైక్‌పై పరారయ్యాడు. ఇంతలో గ్యాస్ నిర్వాహకులకు డబ్బులు ఇచ్చామని చెప్పగా.. మీరు ఎవరికి ఇచ్చారోనని చెప్పడంతో దంపతులు అవాక్కయ్యారు. మోసపోయారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జూన్ 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన ఘటన శంషాబాద్ మండలంలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు నరేందర్‌రెడ్డి కథనం మేరకు.. నర్కూడకు చెందిన చెక్కల శ్రీనివాస్ గ్రామ శివారులోని అమ్మపల్లి ఆలయం పక్కన ఉన్న డెయిరీఫాంలో కూలీగా పని చేస్తూ అక్కడే ఉంటున్నాడు. మూడు నెలల క్రితం సోదరుడి వివాహం కోసం చెక్కలోనిగూడెంకు వచ్చి 10 రోజులు అక్కడే ఉన్నాడు. అనంతరం స్వగ్రామానికి వెళ్లిపోయాడు. అయితే, ఈనెల 17న డెయిరీఫాం యజమాని లింగం రామారావు శ్రీనివాస్ సోదరుడు చెక్కల రవికి ఫోన్ చేసి ఆవులు, గేదెలను మేపేందుకు వెళ్లి రాలేదని, గ్రామానికి వచ్చాడా? అని అడిగాడు. దాంతో రవి నర్కూడకు వెళ్లి చూడగా కనిపించలేదు. గురువారం రవి ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.